నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

3 | నిజామాబాద్, బుధవారం 7 మే 2025 | KAMAREDDY




## ఆర్మూర్‌లో నేహాశెట్టి సందడి

**ఆర్మూర్ పట్టణంలో** సినీ నటి నేహాశెట్టి సందడి చేశారు. పట్టణంలోని మామిడి పల్లి చౌరస్తా వద్ద ఎల్వీఆర్ షాపింగ్ మాల్‌ను మంగళవారం ఆమె ప్రారంభించారు. షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి స్థానిక ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు వినయ్‌కుమార్ హాజరయ్యారు.
–ఆర్మూర్ టౌన్, మే 6





నిజామాబాద్ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



**ఎప్పుడు కొంటరో తెలియడం లేదు...**
కొనుగోలు కేంద్రానికి తీసుకు వచ్చిన వడ్లు ఎప్పుడు కొంటరో తెలియడం లేదు. అకాల వానకు వడ్లు తడిసి పోయాయి. హమాలీలు లేరు. వడ్లు నింపడానికి సంచులు కూడా ఇస్తలేరు. ఎప్పుడు కొంటారని అడిగితే సమాధానం ఇస్తలేరు.
**- లావణ్య, ముబారక్‌నగర్**



**తడిసిన ధాన్యం కొనాలి...**
ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం వర్షానికి తడిసి ముద్దయ్యింది. వడ్లను కోసిన వెంటనే తీసుకువస్తే కొనేందుకు ముందుకు రావడం లేదు. తేమ ఉన్నదని దాటవేస్తున్నారు. ఇప్పుడు వాన పడి, వడ్లు తడిసిపోయాయి. మా పరిస్థితి అర్థం కావడం లేదు. తడిసిన ధాన్యం కొనాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.
**- లత, ముబారక్‌నగర్**



**గతంలో ఇలా ఎప్పుడూ కాలేదు..**
కండ్ల ముందే భారీ వానకు వడ్లు తడుస్తుంటే గుండె తరుక్కుపోయింది. వానలో కొట్టుకు పోతున్న వడ్లను చేతులతో ఎత్తి కుప్ప పోసుకున్నాం. మా పరిస్థితి చూస్తుంటే ఏడుపు వస్తుంది. గతంలో ఇలా ఎప్పుడూ కాలేదు.
**- పెంచలయ్య, రెడ్డి క్యాంప్**



**సమయానికి వడ్లు కొంటలేరు...**
పది రోజుల క్రితం మేం పంట కోసి ధాన్యం తీసుకువచ్చినం.తేమ శాతం ఎక్కువ ఉందంటే ఆరబెట్టుకుంటున్నాం. సరైన వసతులు ఇక్కడ లేవు. మార్కెట్ యార్డులోనే నేలపై వడ్లు ఆరబోసుకున్నాం. వానకు తడిసి పోయాయి. టార్పలిన్లు కూడా దిక్కులేవు. సమయానికి వడ్లు కొని ఉంటే ధాన్యం తడిసేది కాదు.
**- ధనలక్ష్మి, తారకరామనగర్**

# అన్నదాతకు అకాల నష్టం

- కొనుగోళ్లలో జాప్యం.. తడిసిన ధాన్యం..
- రోడ్లపై రోజులతరబడి వడ్ల కుప్పలు...
- అకాల వర్షానికి తడిసి ముద్దవుతున్న వడ్లు
- ధాన్యం బస్తాల తరలింపునకు లారీల కొరత
- తరుగుపేరిట దోపిడీకి పాల్పడుతున్న మిల్లర్లు
- కర్షకుల నుంచి సంచికి రూ.2 చొప్పన వసూళ్లు
- రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్న రైతులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



వర్షానికి నిజామాబాద్ మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యపు బస్తాలు



తడిసిన ధాన్యాన్ని ఎత్తుతున్న మహిళా రైతు

నిజామాబాద్, మే 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. పంట కోతలు మొదలు నుంచి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించే వరకు ఎన్నో ఆటంకాలను అధిగమించాల్సిన పరిస్థితి. యాసంగి పంట కొనుగోళ్లలో అంతులేని నిర్లక్ష్యం తాండవిస్తున్నది. ధాన్యం కొనాలంటూ రైతులు రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన దుస్థితి దాపురించింది. కొనుగోలు కేంద్రాల్లో లారీలు, హమాలీల కొరతతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు చిల్లర దోపిడీకి అంతులేకుండా పోతున్నది. కల్లాల్లో విక్రయించిన ధాన్యం సంచులు తరలించాలంటే లారీ యజమానులు బెదిరింపులకు పాల్పడుతున్నారు. సంచికి రూ.2నుంచి రూ.4వరకు లారీ ఓనర్లు, డ్రైవర్లు ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ఒకవైపు ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం నెలకొనగా, మరోవైపు అకాల వర్షాలు రైతులను ఆగమాగం చేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలు, కల్లాలు, రోడ్లపై ధాన్యం నిల్వలు తడిసి ముద్దవుతున్నా.. అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకునేందుకు క్షేత్ర స్థాయిలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పత్తా లేకుండపోవడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నట్లుగా ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగంగా జరగడంలేదు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వాల్సి వస్తుందనే కారణంతోనే జాప్యం చేస్తున్నట్లు బీఆర్ఎస్ ఆరోపిస్తున్నది. కేసీఆర్ హయాంలో సమన్వయంతో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ జరిగేది. రవాణా, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, సహకార, పౌరసరఫరాల శాఖ, పౌర సరఫరాల సంస్థ అధికారులు నిరంతరం సమన్వయంతో పని చేసేవారు. లారీల కొరత ఇప్పుడు తీవ్రంగా వేధిస్తోంది. గతంలో ఇదే సమస్య తలెత్తితే రోడ్లపై ట్రాన్స్‌పోర్ట్ అధికారులు అందుబాటులో ఉన్న వాహనాలను కల్లాలకు మళ్లించిన రోజులున్నాయి. కానిప్పుడు పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడు. ఉన్నతాధికారులు కేవలం కలెక్టరేట్ సమీక్షలకే పరిమితమవుతున్నారు. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఉమ్మడి జిల్లాల్లో ధాన్యం నిల్వలు తడిసిపోయాయి. తడిసిన ధాన్యాన్ని వ్యవసాయ శాఖ అధికారులు పరిశీలించడంలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందనా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

### చిల్లర దోపిడీ..

ధర్పల్లి మండలంలో మూడు రోజుల క్రితం చిల్లర దోపిడీ వ్యవహారంపై లారీ యజమానాలు, డ్రైవర్లతో రైతులకు ఘర్షణ చోటుచేసుకున్నది. రాత్రివేళ వడ్ల సంచులను తరలించాలంటే బస్తాకు రూ.2 చొప్పున డబ్బులు ముట్టజెప్పాలంటూ పట్టు బట్టడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. డబ్బులు ఇచ్చేవరకు లారీలను కదపకపోవడంతో మిగిలిన చోట్ల బస్తాలను తరలించడానికి జాప్యం నెలకొంటున్నది. మరోవైపు తరుగు పేరుతో రైతులను రైస్ మిల్లర్లు నిలువునా ముంచేస్తున్నారు. కల్లాల్లో క్వింటాలుకు 2 కిలోలు చొప్పున కోత పెడుతుండడంతో అన్నదాతలు లోబోదిబోమంటున్నారు. రైస్ మిల్లులకు బస్తాలు చేరిన తర్వాత క్వింటాలుకు మరో 2కిలోల నుంచి 3 కిలోల చొప్పున కోత విధిస్తున్నారు. పంట పండించడం ఒక ఎత్తయితే ఆ పంటను అమ్ముకోవడం కత్తిమీది సాములా మారింది. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది. కాంటా అయిన ధాన్యం తరలించడంలేదు. లారీల్లో లోడింగ్‌లోనూ జాప్యం నెలకొంటున్నది. కేంద్రాల నుంచి ధాన్యం తరలించినా, అన్ లోడింగ్ కాకపోవడంతో రైస్ మిల్లులు వద్ద లారీలు బారులు తీరుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదు. కనీసం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు కొనుగోలు తీరుపై కనీసం కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

---

- ఎన్నికల హామీలకు శాశ్వత సమాధి కట్టిన రేవంత్‌సర్కార్
- కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాల పాలనను సాగనివ్వబోం..
- బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

# తెలంగాణను అస్థిరపర్చే కుట్ర

**రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్.. ఒక ప్లాన్ ప్రకారమే డ్యామేజ్**


ఖలీల్‌వాడి, మే 6 : తెలంగాణను అస్థిరపర్చే కుట్రలో భాగంగానే రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందంటూ సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను ఒక ప్లాన్ ప్రకారమే డ్యామేజ్ చేస్తున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌కు వచ్చే పెట్టుబడులు అమరావతికి మళ్లించేందుకు చంద్రబాబు రేవంత్ ద్వారా స్కెచ్ వేశారని ఒక ప్రకటనలో ఆరోపించారు. కేసీఆర్ హయాంలో చేసిన అప్పు కేవలం రూ.3.17 లక్షల కోట్లు మాత్రమేనని తెలిపారు. కానీ రూ. 7లక్షల కోట్లు అప్పు చేశారని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. కేసీఆర్ రూ.3.17 లక్షల కోట్ల అప్పు చేసి తెలంగాణను పునర్నిర్మించారన్నది జగమెరిగిన సత్యమని పేర్కొన్నారు. కేసీఆర్ ముందుచూపు పాలనతో సంపద పెంచి ప్రజలకు పంచిపెట్టారని, ఇవన్నీ రిజర్వు బ్యాంకు నివేదికలో పొందుపర్చిన అక్షర సత్యాలని తెలిపారు. రూ.30లక్షల కోట్లకు పైగా సంపద సృష్టించిన ఘనత కేసీఆర్ సర్కార్‌కు దక్కుతుందని స్పష్టం చేశారు.

### కేసీఆర్ పాలనలో జీవన ప్రమాణాలు మెరుగు

కేసీఆర్ పదేండ్ల పాలనలో గణనీయంగా పెరిగిన తెలంగాణ ఆదాయంతో అన్ని రంగాలు బలోపేతమై, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. అదే అధికారులు, అదే యంత్రాంగమని, ప్రభుత్వం మారగానే ఆదాయం ఎందుకు పాతాళంలోకి పడిపోయిందని ప్రశ్నించారు. కేసీఆర్ పాలనలో పెరిగిన ఆదాయం, కాంగ్రెస్ సర్కార్ రాగానే ఎందుకు తగ్గిందని నిలదీశారు. అప్పుడు పరుగులు పెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇప్పుడెందుకు పడకేశాయని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ చేతకాని పాలనకు పరాకాష్టకాదా ? అని మండిపడ్డారు.

### రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం గాలికి..

అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలోనే రూ. లక్ష కోట్లకు పైగా అప్పు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఒక్క కొత్త ప్రాజెక్టు కూడా నిర్మించలేదని తెలిపారు. ఒక్క కొత్త సంక్షేమ పథకం అమలు చేసిన పాపాన పోలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారని మండిపడ్డారు. ఢిల్లీ చుట్టూ ప్రదక్షిణలు చేయడం, విదేశీ వ్యవహారాల్లో సీఎం రేవంత్‌రెడ్డి మునిగి తేలుతున్నారని విమర్శించారు. హెలిక్యాప్టర్ లేకుండా మంత్రులు అడుగుతీసి అడుగు వేయడంలేదని పేర్కొన్నారు. అందాల పోటీల పేరుతో కోట్లు తగిలేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల హామీలకు శాశ్వత సమాధి చేశారని పేర్కొన్నారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో ఉద్యోగులను ఉసిగొల్పి, ఇప్పుడు కసి తీర్చుకుంటారా అని ప్రశ్నించారు. కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, దుష్టకాంగ్రెస్‌ను తరిమికొట్టడమే ప్రజల కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధికి మసిపూసి, అప్పును భూతద్దంలో చూపిస్తున్న కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాల పాలన సాగనివ్వబోమని జీవన్‌రెడ్డి హెచ్చరించారు.



---

# ట్రాఫిక్ ఏసీపీపై వేటు

- డీజీపీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
- కొత్త ట్రాఫిక్ ఏసీపీగా మస్తాన్ అలీకి బాధ్యతలు

వినాయక్‌నగర్, మే 5: నిజామాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏసీపీ నారాయణపై వేటు పడింది. ఆయనను హైదరాబాద్‌లోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్(డీజీపీ) కార్యాలయానికి అటాచ్ చేశారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఆయన స్థానంలో సీటీసీ (పోలీస్ ట్రైనింగ్ సెంటర్)లో విధులు నిర్వర్తిస్తున్న మస్తాన్ అలీకి ట్రాఫిక్ ఏసీపీగా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. బదిలీ ఆర్డర్స్ వచ్చిన వెంటనే ట్రాఫిక్ ఏసీపీ నారాయణ బాధ్యతల నుంచి రిలీవ్ అయినట్లు సిబ్బంది తెలిపారు.



---

# ‘డబుల్ ఇండ్ల’ను పంపిణీ చేయాలి

- లేదంటే పేదలతో ఆక్రమింపజేస్తాం..
- తహసీల్దార్‌కు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకుల వినతి




తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

ధర్పల్లి, మే 6 : మండల కేంద్రంలో నిర్మించిన 48 డబుల్ బెడ్ రూం ఇండ్లను పేదలకు అందించాలని, లేనిపక్షంలో వారిచేత ఇండ్లను ఆక్రమింపజేస్తామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు అన్నారు. ఈ మేరకు ఆర్మూర్ డివిజన్ సహాయ కార్యదర్శి ఆర్. రమేశ్ ఆధ్వర్యంలో మహిళలు మంగళవారం తహసీల్దార్ మాలతికి వినతిపత్రం సమర్పించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా కాలయాపన చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే ఇండ్లను పంపిణీ చేసి, పేదల సొంతింటి కలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చినవారిలో స్వరూప, లక్ష్మి, శారద, జమున, సులోచన, నూర్జహాన్, సహనాబేగం, నాయకులు ఉన్నారు.



వడ్లు కొనుగోలు చేయాలని మాదాపూర్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులు

# ధాన్యం కొనుగోలు చేయాలని రాస్తారోకో

- వడ్లను సేకరించడంలో జాప్యంపై రైతుల ఆగ్రహం
- మాక్లూర్ మండలం మాదాపూర్‌లో బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన

మాక్లూర్, మే 6: ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యాన్ని నిరసిస్తూ మండలంలోని మాదాపూర్‌లో రైతులు ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం ఆధ్వర్యంలో గ్రామంలోని నందిపేట్–నిజామాబాద్ రహదారిపై మంగళవారం రాస్తారోకో చేశారు. రెండుగంటలపాటు ఎర్రని ఎండలో బైఠాయించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. నెలల తరబడి ధాన్యం కొనుగోలు చేయడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తూకం వేసిన బస్తాలను లారీల కొరత పేరుతో తరలించడంలేదని, రైస్‌మిల్లుల యజమానులతో కుమ్మక్కై కిలోకు తరుగు పేరిట దోచుకుంటున్నారని ఆరోపించారు. సోమవారం కురిసిన అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నెల రోజులుగా హమాలీలు లేక తూకం వేయకుండా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. విషయం తెలుసుకున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్‌డీఏ సాయాగౌడ్, ఏఈడీఏ విజయలక్ష్మి, తహసీల్దార్ వచ్చి, రైతులను సమదాయించారు. సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చి, రాస్తారోకో విరమింప జేశారు. రాస్తారోకోతో పెద్దసంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో మాక్లూర్ ఎస్సై రాజశేఖర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

---

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

**కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



భవానీపేటలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

లింగంపేట, మే 6: కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కామారెడ్డి కలెక్టర్ ఆదేశించారు. మండలంలోని నల్లమడుగు, ముంబాజీపేట, భవానీపేటలో మంగళవారం ఆయన పర్యటించారు. భవానీపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. కేంద్రంలో ఏర్పాట్లు, ధాన్యం తరలింపు తదితర అంశాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైస్‌మిల్లుల్లో ఆన్‌లోడ్ చేయడంలో జాప్యం జరుగుతున్నదని సిబ్బంది వెల్లడించారు. భూ భారతి చట్టంలో సర్వే పూర్తిచేసి వివరాలు సేకరించాలని కలెక్టర్ సూచించారు. రైతులు సాగు చేస్తున్న భూములు రెవెన్యూకు సంబంధించినవా లేక అటవీ శాఖకు చెందినవా గుర్తించాలని ఆదేశించారు. అనంతరం రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు.